# కలం వీరులు

ఆంధ్ర రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న పట్టణం అది. సమస్త కళలకి, రాజకీయాలకి ఆలవాలం ఆ ఊరు. ప్రముఖ దిన, వార పత్రికలతో పాటు చిన్నా చితకా పత్రికలెన్నో అక్కడ.

అలాంటి ఓ చిన్న తరహా పత్రికాఫీసులో మూలగా ఉన్న ఓ గదిలో, రెండు బల్లల చుట్టూ కూర్చున్న నలుగురూ వంచిన తలలెత్తకుండా దీక్షగా రాసేస్తున్నారు.

చేతికందిన నెలజీతాన్ని పదిరోజుల్లో కాల్చి పారేసే సత్తా ఉన్న వాళ్లే అంతాను.

అంచేత ఒక చేతికే పని చెప్పనేల.... అనుకున్నారేమో రెండో చేతిలో 'అగ్గి బరాటా' పుచ్చుకొని, దాని స్ఫూర్తితో, భావపరంపరని ఉత్పత్తి చేసేస్తున్నారు. అలవాటైన పనేమో నల్లేరుమీద బండి వాళ్లకి.

తర్జుమా చెయ్యవలసిన న్యూస్ అయిటమ్స్‌తో పాటు, రిఫరెన్స్ పుస్తకాలు, డిక్షనరీలు మధ్య బరబరా రాసేస్తున్న వాళ్లుకాస్తా 'ఎడిటర్‌గారు పిలుస్తున్నారండీ', అన్న అటెండర్ మాటతో తమలో ఎవర్నా అన్నట్టు చూశారు.

వెంకటేశాన్ని ఉద్దేశించి "మిమ్మల్నేనండీ" అన్నారు.

"అమ్మో! నన్నే......?

ఎందుకబ్బా! బహుశా అక్షింతలెయ్యడానికేమో." అనుకుంటూ వెళ్ళాడు.

అనుకున్నట్టుగానే ధుమధుమ లాడుతున్న మొహంతో తిరిగొచ్చాడు కూడానూ.

"బాగా తలంటోసినట్టున్నాడురోయ్" అనుకున్నారు ఒకళ్ల మొహాలొకళ్లు చూస్తూ. అందులో ఒక్క నీలకంఠానికి తప్ప మిగిలిన ఇద్దరికీ సానుభూతి కంటే ఆనందమే ఎక్కువ. ఎందుకంటే వెంకటేశం నిజమైన జర్నలిస్టు. తెలుగుజర్నలిజానికి కొద్దో, గొప్పో సేవ చేస్తున్న వాళ్ళలో వెంకటేశం కూడా ఒకడని చెప్పవచ్చు.

ప్రత్యేక తరహా, అంటే మానవ కుతూహలాన్ని రేకెత్తించే వార్తల్ని సేకరించడంలోనూ, వార్తాకథల్ని అందించడంలోనూ పత్రికకి పేరు తెచ్చే 'స్కూప్'ని సంపాదించడంలోనూ వెంకటేశానికి ఉన్న చొరవ, అతడు చూపే ధైర్య సాహసాలు మిగిలిన జర్నలిస్టులకి స్ఫూర్తినిస్తూ ఉండేవి.

ఈ సారి కూడా— సంచలనాన్ని రేకెత్తించే సమాచారాన్ని సేకరించుకొచ్చాడు.

మేనేజిమెంట్‌కి— కంట్రాక్టర్లకి ఉన్న లావాదేవీలు ఆ 'నిజాన్ని' ప్రచురించడానికి పెద్ద అడ్డంకులయ్యాయి. "ఈ వృత్తిలో ఈ అడ్డంకులన్నీ మామూలే నాయనా, ముందు నువ్వీ నిజాన్ని హరాయించుకో, ఈ రంగంలో పైకొస్తావ్ లేదా నీ ఆదర్శాల నావలోనే ప్రయాణం చేస్తానంటావా..... నావ మునిగిపోయే ప్రమాదం ఉంది. తస్మాత్ జాగ్రత్త" అని అనుభవజ్ఞులు ఎన్ని హితవచనాలు చెప్పినా మన వెంకటేశానికి తలకెక్కలేదు. పైగా అంటాడు గదా "ఇలా అయితే నేను మానేస్తాను. వేరే పత్రిక నీడలోకి పోతాను" అంటూ ఇటీవల రాజీనామా పత్రాన్ని కూడా సమర్పించాడు. అది ప్రస్తుతం పత్రికాధిపతుల పరిశీలనలో ఉంది. అంతేకాదు. అప్పట్నుంచీ మేనేజిమెంటువారు అతగాడ్ని, చీటికి మాటికీ గదిలోకి పిలిపించి, మందలింపుల ప్రహసనాన్ని కొనసాగిస్తున్నారు కూడా.

ఇవాళ కూడా అలాంటిదేదో జరిగే ఉంటుంది. అందుకే చిటపటలాడి పోతున్నారు.

ఈ రంగంలో వయసురీత్యానే కాక అనుభవం రీత్యా కూడా చిన్నవాడైన వెంకటేశాన్ని అతగాడి పేరుని చూచి కుళ్లుకునే వాళ్లు కాస్తా, అతగాడిని ఇలాంటి స్థితిలో చూచినప్పుడు అపరిమితంగా ఆనందిస్తారు. ప్రస్తుతం ఆ స్థితిలో ఉన్న ఇద్దరూ నీలకంఠం వ్యాఖ్యతో ఈ లోకంలోకి వచ్చిపడ్డారు.

"మనకీ తాలూకాఫీసుల్లో గుమాస్తాలకీ అట్టే తేడా లేదు", భలేవాడివే లే. ఆఫీసుకి వచ్చే టైముకంటే, ఆఫీసు నుంచి ఇంటికెళ్లే టైమే ఎక్కువ గుర్తుంటుంది వాళ్ళకి, మరి మనమో మనకి రెండూ గుర్తుంటాయి. అందుకని తేడా ఉందంటాను నేను. రెంటికీ మధ్య వంచిన తలలెత్తకుండా తెలుపుని నలుపుచెయ్యడం. అంతేకాదు. న్యూస్ స్టోరీస్‌ని సంపాదించే పాటి తెలివీ ధైర్యంతో పాటు వృత్తిని పణంగా పెట్టి సాముచేసుకోవడం, అదీ తెలీని తెలివితక్కువ వాళ్ళు ఏ ఒకరో ఇద్దరో కూడా మనలోనే ఉండటం, ఇన్ని తేడాలున్నాయి మరి." ఎద్దేవాచేస్తున్న వాడిలా మాట్లాడాడు రామనాథం.

వయసులో నలుగురికీ అట్టే తేడా లేకపోయినా బుద్ధిలో వెంకటేశానికీ, రామనాథానికీ నింగికీ నేలకు ఉన్నంత అంతరం ఉంది. తన మాటల ద్వారా, చేష్టల ద్వారా దాన్ని ప్రతిక్షణం గుర్తు చేస్తూనే ఉంటాడు రామనాథం.

అసలే మనసంతా చికాకుగా ఉందేమో రామనాథం మాటలకి చిర్రెత్తిన వెంకటేశం, "అవునవును. అందులో ఆక్షేపణేమీ లేదు. కాకపోతే చిన్నచిన్న కంట్రాక్టర్ల దగ్గర్నుండీ, బడాబడా రాజకీయ నాయకుల వరకూ, వాళ్ల మధ్య ఉన్న అవినీతి, ఏ సందర్భాలలో ఏ విధంగా ప్రజలని మభ్యపెట్టేదీ, మోసగించేదీ... ప్రజాసొమ్ముని రెడ్‌హాండెడ్‌గా పట్టుకొని కూడా వాళ్ళు "చూపించే ఆకర్షణల బారినుంచి బైటపడే మనోబలం లేక లొంగిపోయేవాళ్లు కూడా మనలోనే ఉన్నారు. అదీ తెలుసు" అంటూ ప్రతిస్పందించాడు వెంకటేశం.

బండి గాడితప్పుతోందన్న అనుమానం వచ్చి, చిన్న బ్రేక్ వేసాడు నీలకంఠం "వాస్తవాలని సేకరించి ప్రచురిస్తే పేపర్లకి, తద్వారా యాజమాన్యానికే కదా పేరొచ్చేది. మరెందుకో అభ్యంతరాల పరంపర?"

"అదే నాయనా అసలు విషయం," అన్నాడు అంతవరకూ నోరువిప్పని చిదంబరం.

"ఏమిటూ విషయం? ఏమా కథ?" కుర్చీ వెనక్కి జారగిలపడి గుప్పు...గుప్పు సిగరెట్టు పొగని గాల్లోకి వదులుతూ అర్ధనిమీలుడై అడిగాడు రామనాథం.

కుర్చీలో నిటారుగా కూర్చున్న చిదంబరం, అంతలోనే బల్లమీదికి వంగిపోయి, ఎవరన్నా అనవసరపు మనుషులు వినిపోతారన్నట్టుగా గొంతు తగ్గించి... వెన్నెముకతో పని నాయనా.. అదీ విషయం. అర్ధమైందా...? లేకపోతే ఇంకా స్పష్టంగా యేడిచేదా...? నలుగుర్నీ ఉద్దేశించి అంటూ, కళ్లుదించి మూలనున్న తెలుగు టైపిస్టు వాలుకళ్ల వారిజాక్షి కేసి వాలుగా చూశాడు.

తనకేం పట్టనట్టుగా టకటక లాడించేస్తోంది ఆ అమ్మాయి. "ప్రపంచం ఏమయిపోయినా పట్టదు చాలామందికి" అని స్వగతించి, "అయినా... ఇంకోళ్లని ఆడిపోసుకోవడం ఎందుకులే...మనకి మాత్రం వృత్తి మీదకంటే.... వృత్తిమీద వచ్చే లాభాల మీదే మోజెక్కువాయే... సరిసరి. ఇలా మాట్లాడుతూ కూర్చుంటే ఇహ ఇవాల్టికి పేపరొచ్చినట్టే... కానియ్యండి.... కానియ్యండి" అంటూ తలొంచి రాసుకోసాగాడు. మిగిలినవాళ్లు కూడా పనిలో తలదూర్చారు. ఓ అరగంట అయ్యిందో లేదో సంధించిన బాణంలా రివ్వున దూసుకొచ్చాడు అటెండరు రామయ్య. ఈ పిలుపెవరికా అన్నట్టు చూశారు.

ఈ సారి వెంకటేశంతో పాటు రామనాథాన్ని కూడా పిలిచారట.

"ఇందాకటి డోసు సరిపోలేదనుకున్నారేమో" అంటూ జాలిపడ్డారు మిగిలినవాళ్ళు.

ఎడిటర్‌గారి గదిలోకి అడుగుపెట్టిన ఇద్దరూ అక్కడున్న మరో వ్యక్తిని చూసి గతుక్కుమన్నారు.

ఆయనెవరోగాదు మరి... సాక్షాత్తూ ఎమ్.డి.

సద్దుకూర్చునేంతలో, రామనాథం వైపు దృష్టిని సారించి "ఈ అబ్బాయేనండి" అన్నారు. సంపాదక మహాశయులు. తలా తోకా తెలీని రామనాథానికి "నా ప్రాణం మీదికేదో వచ్చిందిరా దేవుడా" అనిపించింది.

"స్పిన్నింగ్ మిల్ వ్యవహారాన్నంతా బైటపెట్టింది మీరే అన్నమాట. శభాష్" అన్నాడాయన.

వాళ్లంటే పడదుకామోసు. అందుకే ఈ అభినందన. లేకపోతే... కథ అడ్డంతిరిగేదే" మనసులో అనుకొన్నాడు రామనాథం.

అబ్బో.. చాకులాంటి కుర్రాడండోయ్" అన్నారు సంపాదకులు.

ఎమ్.డి మాత్రం "ఒహో అలాగా..." అనేసి వెంకటేశాన్ని ఉద్దేశించి "రాజీనామా ఇచ్చింది వీరేనా" అని అడిగాడు.

అవునన్నట్లుగా తలపంకించాడు ఎడిటర్.

ఇహ అంతటితో ఆ ప్రసక్తి ఆపేసి, ఓ ఐదు నిమిషాలపాటు పిచ్చాపాటి మాట్లాడి మరోసారి కలుద్దాం... అన్చెప్పి ఇద్దర్నీ పంపించేశారు. బ్రతుకు జీవుడా అనుకుంటూ బైటపడ్డారు ఇద్దరూ.

తన్నెందుకు పిలిచిందీ అర్థంగాక ఆలోచించ సాగాడు వెంకటేశం.

"ఏమోయ్ వెంకటేశం పరాకు చిత్తగించావేమిటి? వేగిరం పనికానిచ్చుకొని బైటపడితిమా 'ప్రెస్‌మీట్'



కి వెళ్ళొచ్చు. సినిమా వాళ్లదాయే. గొంతుతడిపే సాంప్రదాయం కూడా ఉంటే ఉండొచ్చు. ఆ పైవాళ్లిచ్చే బహుమతులు.. ఇక్కడ కూర్చుంటే ఏమొస్తుంది బూడిద" అంటూ పనిలో పడ్డాడు రామనాథం.

మరుసటిరోజున ఆఫీసులో ఓ గమ్మత్తు జరిగింది. రామనాథానికో కవరు, వెంకటేశానికో కవరు ఇచ్చి దూరంగా నిలబడ్డాడు అటెండరు రామయ్య. మొహం చూస్తే అందులో విశేషం ఏమిటో రామయ్యకి తెలిసినట్టే ఉంది.

"ఏమై ఉండవచ్చు".. అని వణికే చేతులతో కవరందుకున్నాడు వెంకటేశం.

ఇంతలో హుర్రే అంటూ గంతులేస్తున్న రామనాథం కేసి అంతా అయోమయంగా చూడసాగారు. ఏమిటయ్యా కథ అంటే రామనాథానికి రెండు ఇంక్రిమెంట్లిచ్చి, జీతం పెంచినట్టుగా అధికార వార్తని మోసుకొచ్చిందా కవరు. ఆనందం అర్ణవమై కేకల రూపంలో ప్రతిధ్వనిస్తోంది మరో ప్రక్క చిన్నబోయిన మొహంతో పిచ్చిచూపులు చూస్తూ నిల్చొని ఉన్నాడు వెంకటేశం. ఎందుకంటే తన రాజీనామాని మేనేజమెంటు అంగీకరించింది కాబట్టి.

రాజీనామా చేసేడేగాని తన సర్వీసుని దృష్టిలో పెట్టుకొని రాజీ ప్రయత్నాలు చేస్తుందనుకున్న మేనేజమెంటు, ఎకాఎకి ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందని ఊహించలేకపోయాడు వెంకటేశం.

"నిధి చాల సుఖమా, ఎడిటర్ సన్నిధి చాల సుఖమా" అని త్యాగరాజుని సైతం తనకనుగుణంగా మలచుకొని కూనిరాగాల జోరులో కాగితాల మీదకు లంఘించాడు రామనాథం.

ఇలా ఓ వారం అయ్యిందో లేదో ఓ సుప్రభాతపు వేళ, 'డిటర్జెంట్సు'కి మోడలింగు చేసేవాడికి మల్లే... మల్లె పూవులాంటి తెల్లటి బట్ట తీసుకొని, టక్ చేసి, నిగనిగలాడే బూట్లని టకటక లాడిస్తూ ఆఫీసుకి వేంచేసాడు రామనాథం చేతిలో స్వీట్‌పాకెట్‌తో సహా.

"బాపు బొమ్మల్లే ఉండే ఇంటి వారమ్మాయితో ఉన్న పరిచయం కాస్తా ప్రేమ తద్వారా పెళ్లికి దారి తీసిందేమో? ఆ సంతోషాన్ని ఇలా స్వీట్ల రూపంలో పంచి పెడుతున్నాడేమో గురుడు... అని ఒకరనుకుంటే—

తెలుగు వారి హృదయాలను దోచుకొన్న ఓ ప్రముఖ వార పత్రిక వారు నిర్వహించిన నవలల పోటీలో రామనాథానిగ్గానీ ఫస్టు ప్రైజు రాలేదు గదా...? అనుకుంది వారిజాక్షి.

మొత్తం మీద కారణం ఏమై ఉండనోపును అనుకున్నవారే అంతానూ... కానీ విషయాన్ని కనుక్కోలేకపోయారు ఒక్కరూనూ.

గురుడు పలుకుతాడేమోనని చూసారు గానీ, సాయంకాలం వరకూ పెదవి కదిపితే ఒట్టు.

అందరూ గూటికి చేరే సంరంభంలో ఉండగా అపుడు చెప్పాడు రామనాథం తాను వచ్చేనెలకల్లా ఇక్కడ్నించి మరో పత్రికలోకి మారబోతున్నానని. అక్కడ కూడా ఇదే పోస్టులోకి తీసుకున్నారు కాని ఇక్కడి కంటే జీతం రెండింతలు ఎక్కువని చెప్పాడు. "సేమ్ పోస్టు ఎందుకు? పై దానికి ట్రైచెయ్యలేకపోయావా?" అని అడిగితే, మనికి కావల్సింది పణం... గాని బాధ్యతకాదుగా" అన్నాడు

బాధ్యతల కంటే ఎక్కువగా హక్కుల గురించి మాట్లాడే యువతరానికి ప్రతినిధిలా.

బైపిస్టు వారిజాక్షికి మాత్రం ఓ సందేహం పుట్టుకొచ్చి అడిగేసింది కూడానూ....

రెప్పలల్లాడిస్తూ, పెద్ద పెద్ద కళ్లతో అమాయకంగా చూస్తూ బుగ్గలు సొట్టలు పడేలా నవ్వుతూ అడిగిన 'వారిజాక్షి'కి ఎవరుమాత్రం సమాధానం చెప్పకుండా ఉండగలుగుతారు. అంచేత చెప్పేసాడు "ఆ మధ్య నా జీతం పెంచిన విషయం మీకు తెలిసే ఉంటుంది. ఏదో పనిపడి జీతం సర్టిఫికెట్ ప్రొడ్యూస్ చెయ్యాల్సి వచ్చింది. అది కాస్తా పుచ్చుకొని, సమయానికొచ్చిన ఆఫర్‌ని సద్వినియోగపరచుకున్నా"

"అంటే జీతం సర్టిఫికెట్....

"మీ అనుమానం సరైనదే. దాన్ని వాళ్లకి చూపించి ఇదే పోస్టుకి అక్కడ ఎక్కువ జీతానికి ఒప్పందం కుదుర్చుకున్నా. అదీ కథ.

"మరి ఎడిటర్ గార్కు........"

"ఇక రేపోమాపో వెళ్ళిపోయే వాడిని ఎవ్వరేమనుకున్న నో ఖాతర్... అంటూ వడివడిగా అడుగులేసుకుంటూ వెళుతున్న రామనాథం కేసి, వ్యాపార నాగరికత ఇంకా వంటబట్టని వారిజాక్షి ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది.

**కాశీవఝుల రమానరసింహం**